అల్లూరి సీతారామరాజు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని పోతంగి పంచాయతీ తోటవలస గ్రామంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో నిరుపేద గిరిజనులకు ఉచితంగా నిత్యావసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద గిరిజనులు కొన్ని సందర్భాలలో నిత్యావసర సరుకుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి ఎంతో కొంత సేవలందించాలన్న ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అల్లూరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె.నగేష్ పాల్గొన్నారు.

సరుకులు ఇస్తున్న సంఘం అధ్యక్షురాలు

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు

- ఒకరు మృతి - పలువురికి గాయాలు

కోట్నపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో రోధిస్తున్న బంధువు

పెదబయలు మండలం కిముడుపల్లిలో చెల్లాచెదురైన క్షతగాత్రులు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని కోట్నపల్లి గ్రామ సమీపం బ్రిడ్జి వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీ కొన్నాయి. స్థానిక ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని దుర్గం పంచాయతీ పాలమామిడి గ్రామానికి చెందిన తమర్ల వెంకటరావు, సత్యనారాయణలు ద్విచక్ర వాహనం పై హుకుంపేట వస్తున్నారు. కొట్నాపల్లి బ్రిడ్జి సమీపంలో రెండు బైకులు ఢీకొన్నాయి. పాలమామిడి గ్రామానికి చెందిన తమర్ల వెంకటరావు, సత్యనారాయణలకు గాయాల య్యాయి.ఆటోలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెదబయలు రూరల్,పాడేరు: పాడేరు మండలంలోని గుత్తులపుట్టు గ్రామంలో గురువారం జరిగే వారపు సంతకు వివిధ గ్రామాల నుండి వస్తున్న గిరిజనులు ప్రయాణిస్తున్న ఒక జీపు బోల్తా పడింది. పెదబయలు మండలం పరిధిలోని కిముడుపల్లి ఘాట్లో వస్తుండగా జీపు బ్రేక్ ఫెయిల్ అయి అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. లోయలో పడిన జీపు పల్టీలు కొట్టడంతో ఇందులో ప్రయాణిస్తున్న ఆడ మగ కలిపి 20 మంది గిరిజనులు చెల్లాచెదురుగా పడిపోయారు. క్షత గాత్రులను 108 ద్వారా పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి చేరి చికిత్స పొందుతున్న క్రమంలో పాంగి రాజారావు మృతి చెందారు. క్షతగాత్రుల్లో మరో నలుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ జీపు ప్రమాదంలో గాయపడిన గిరిజనులంతా పెదబయలు మండలం పులిగొంది గ్రామానికి చెందినవారు.మరో 10 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పెదబయలు మండలం కిముడుపల్లిలో బోల్తా పడిన జీపు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పరామర్శించారు. మృతుని కుటుంబానికి ఎక్స్గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే తీవ్ర గాయాలతో ఉన్న క్షత గాత్రులను కూడా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మరమ్మతులకు గురైన ఇరిగేషన్ కాలువను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను పునరుద్ధరించాలి

- సిపిఎం నాయకులు సీతారామయ్య, నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను పునరుద్ధరించాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ముల్లూరు, రేపాక గ్రామాల్లోని చెరువులు, చెక్ డ్యామ్‌లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను సిపిఎం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో శబరి, గోదావరి నదులున్నా రైతుల భూములకు సాగునీరు అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. ఒక వైపు భారీ వర్షాలు వచ్చి వరదలకు భూములు మునిగిపోవడం, మరోవైపు వర్షాలు పడకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న సాగు నీటి వనరులను ఉపయోగించడానికి ప్రభుత్వ సహకారం లేకుండా పోయిందని, చెరువులకు సరైన గేట్లు లేక నీరు వృధాగా గోదాట్లో కలిసిపోతుందని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో ఐటిడిఎ ద్వారా నిర్మించిన చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు పాడైపోయినా వాటిని ప్రభుత్వం ఐటిడిఎ అధికారులు పట్టించుకోవడం లేదని, వాటికి మరమ్మతులు చేయడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు స్పందించి చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని, విద్యుత్ లైన్లు ఉన్న భూములలో వ్యక్తిగత బోర్లు, మోటార్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీ అమ్మాజీ, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, నాగమణి, రైతులు పిచ్చయ్య, మడకం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో పది పాయింట్లు సాధించడమే లక్ష్యం

-ఐటిడిఎ పిఒ అభిషేక్ - ప్రత్యేక బోధనా తరగతులు ప్రారంభం

పుస్తకాలను పంపిణీ చేస్తున్న పిఒ

ప్రజాశక్తి-పాడేరు:పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించడమే లక్ష్యంగా క్రమ శిక్షణతో విద్యార్థులు చదువుకోవాలని ఐటిడిఏ పీఓ వి.అభిషేక్ సూచించారు. జీవితంలో ఎదగడానికి ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. బాగా చదువుకుని ఐటిడిఏకు, గిరిజన ప్రాంతానికి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, దిగుమోదా పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 52 మంది పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులను ' గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాలలో 32 మంది బాలికలకు, దిగుమోదాపుట్టు ఆశ్రమ పాఠశాలలో 20 మంది బాలురకు ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక బోధనకు ఎంపికైన విద్యార్థులకు మంచి వసతి, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలు బోధిస్తామని, గిరిజన విద్యార్థులు ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించాలని చెప్పారు. గిరిజన విద్యార్థులలో అపారమైన ప్రతిభా సామర్థ్యాలు ఉన్నాయని చెప్పారు. ఉత్తమ పాయింట్లు సాధించి మారిక వలస కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్స్ లో ప్రవేశం పొందాలని చెప్పారు. కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌లో నీట్, ఐఐటి, లాసెట్ ప్రవేశాలకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తే సంబంధిత సబ్జెక్టు టీచర్లకు ఐటిడిఏ నుండి రివార్డులు అందిస్తామని చెప్పారు. ప్రతీ విద్యార్థికి 20 నోట్స్ పుస్తకాలను పంపిణీ చేసారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లాటరీ విధానంలో పదవ తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూ ఎల్.రజని, ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, గంగా భవాని, మంజుల, ఆర్.దర్మన్న, రీమిలి జాస్, ప్రసాద్, శ్రీనివాస పడాల్ పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే వైసిపి నుంచి పోటీ

- గిరి జాగృతి అసోసియేషన్ నాయకులు సింహాచలం, ఈశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అవకాశం లభిస్తే వైసిపి పార్టీ నుండి పోటీ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని గిరి జాగృతి అసోసియేషన్ అధ్యక్షులు మోరి సింహాచలం, కోశాధికారి కొరతం ఈశ్వరరావు తెలిపారు. అరుకు లోయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇప్పటివరకు గిరి జాగృతి అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వారు తెలిపారు. ఆర్గనైజేషన్ ద్వారా విద్య, వైద్యం వంటి సేవ కార్యక్రమాలు గిరిజనులకు పలు రూపాలుగా అందించినట్లు చెప్పారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ఎంతోమంది ప్రాణాలను కాపాడినట్లు వారు తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే సేవలను మరింత విస్తతపర్చాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు వారు తెలిపారు.వైసీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి వద్దకే వాలంటరీ వ్యవస్థ ద్వారా అందిస్తుందని తెలిపారు. అందుకే వైసిపి పార్టీ తరపున ఒక్కరు ఎమ్మెల్యేగానూ, ఇంకొక్కరు ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధమైనట్టు వారు స్పష్టం చేశారు.ముందుగా పార్టీ అధిష్టానానికి తమ ప్రొఫైల్ ను అందించినట్లు వారు తెలిపారు.

పోలీసు విధుల గురించి విద్యార్థులకు తెలియజేస్తున్న ఎస్ఐ శివకుమార్

డొంకరాయిలో 'పోలీసు ఓపెన్ హౌస్'

ప్రజాశక్తి- మోతుగూడెం

జిల్లాలోని వై.రామవరం మండలం, డొంకరాయి పోలీసు స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం పోలీసు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. డొంకరాయి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు దీనిని సందర్శించారు. పోలీస్ స్టేషన్ ఏ విధంగా పనిచేస్తుంది, ఫిర్యాదు దారులు వచ్చినప్పుడు పోలీసులు ఏ విధంగా స్పందిస్తారు, ఫ్రెండ్లీ పోలీసింగ్ ఎలా ఉంటుంది, మావోయిస్ట్, నక్సల్స్ ప్రాంతాల్లో పోలీసుల విధులు, పోలీసు స్టేషన్లో ఎటువంటి రికార్డులు ఉంటాయి, పోలీసులు కేసు నమోదు చేసిన తరువాత దర్యాప్తు ఏ విధంగా ఉంటుంది, సైబర్ నేరాలకు, సోషల్ మీడియా దుర్వినియోగం చేసినప్పుడు ఐటీ కోర్ టీమ్ ఏ విధమైన టెక్నాలజీ వాడి నేరస్థులను పట్టుకుంటుంది, పోలీస్ స్టేషన్లో ఉన్న ఆయుధాలు- వాటి పనతీరు, సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు మధ్య వ్యత్యాసం, సిబ్బంది విధులు వంటి అంశాలను ఎస్సై శివ కుమార్ విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం డొంకరాయి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు లైంగిక వేధింపుల నుండి మహిళలు, పిల్లల రక్షణ- సామాజిక పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళు సుధాకర్, రామకృష్ణ, కన్నప్ప రెడ్డి పాల్గొన్నారు.

కుంతీదేవి మహోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామంలో కుంతీదేవి అమ్మవారి ఆలయంలో కుంతీదేవి మహోత్సవం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కుంతీదేవి మహోత్సవ జాతర రేఖపల్లి అంబేద్కర్ కాలనీ గ్రామస్తులు జరుపుకుంటారు. శుక్రవారం దేవారుల ఆధ్వర్యంలో రుద్ర దేవి మహోత్సవం ప్రారంభించబడిందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాచర్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ పిల్లలకు బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి రంపచోడవరం

అంగన్వాడీ ప్రీ స్కూల్ పిల్లలకు విలేజ్ రీ ఆర్గనైజేషన్ (విఆర్ఓ) సంస్థ సమకూర్చిన బ్యాగులను గురువారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలు డ్రాప్ అవకుండా ఉండేందుకు వీఆర్వో సంస్థ పని చేస్తుందని చెప్పారు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో నాలుగు రాష్ట్రాల్లో ఎస్సీ ఎస్టీ వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వంతో కలిసి ఇళ్ల నిర్మాణం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఏటా టైలరింగ్, డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జీడి మామిడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రంపచోడవరం సిడిపిఓ సంధ్యారాణి మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలకు బ్యాగులు కావాలని కోరడంతో వెయ్యి బ్యాగులు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఓ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బ్యాగులు అందజేస్తున్న ఇమ్మానుయేలు తదితరులు

కాఫీ, మిరియాలను జిసిసి కొనుగోలు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అరకులోయ రూరల్:అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలో గిరిజనులు పండిస్తున్న కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులకు పరికరాలు ఉచితంగా ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. గురువారం అరకువేలి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ ఏజెన్సీ 11 మండలాల్లో ఆదివాసులు ఆర్థిక వనరు కాఫీ, మిరియాలు పంటలు విస్తారంగా రైతులు సాగు చేస్తున్నారని సుమారు 15 మెట్రిక్ టన్నులు పండిస్తున్నారని సరైన గిట్టుబాటు ధర లేక ఆదివాసి రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో దళారీల చేతుల్లో మోసాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. పార్క్ మెంట్ కాఫీ కిలో రూ.500, చెర్రీ కాపీ కిలో రూ.250, పండు కాఫీ కిలో రూ.100, మంచి మిరియాలు కిలో రూ.1000లకు కొనుగోలు చేయాలన్నారు. మిరియాల పంట సేకరణకు వ్యక్తిగత నిచ్చెనలు ప్రతి రైతుకి ఇవ్వాలన్నారు. కాఫీ పంట ఆరబెట్టుకునేందుకు ప్లాట్ఫారం, ఫల్పర్ మిషన్, తార్పాన్లు ప్రతి రైతుకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఐటిడిఏ అధికారులు జోక్యం చేసుకొని జీసిసి సంస్థ ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి బుజ్జిబాబు, మండల నాయకులు జగన్నాదం, హరి, రత్నకుమారి, నానిబాబు, గురుమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి-పెదబయలు:చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మండలంలో లక్ష్మీపేట పంచాయతీ కేంద్రంలో బాబుతో నేను కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గం ఇంచార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి 16 నెలలు జైలు శిక్ష అనుభవించారని, మిగతా వారిని కూడా జైలుకు పంపించాలన్న దురుద్దేశంతోనే చంద్రబాబు నాయుడుకి అవినీతి మరకలు అంటించారన్నారు. తెలుగుదేశం పార్టీకి పెరుగుతున్న జనాధారణ చూసి ఓర్వ లేక వైసిపి కుట్రలు పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ కార్యదర్శి సాగర సుబ్బారావు, మాజీ సర్పంచ్ ఎన్ ప్రసాద్, దారేలా సర్పంచ్ పాంగి పాండు రంగస్వామి, నాయకులు బత్తిరి రామారావు, కిషోర్ లైకోన్, త్రినాద్, మురళి పాల్గొన్నారు

నేడు అరకులో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-పాడేరు: అరకులో ఈనెల 27న శుక్రవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అరకు ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. స్పందన కార్య క్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. స్పందన అనంతరం శాఖాధికారులు సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అరకు లో స్పందన ఉన్నందున పాడేరులో స్పందన రద్దు చేయడం జరిగిందని, ప్రజలు గమనించి పాడేరు లో స్పందనకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

'ప్రజా రక్షణ భేరి'ని జయప్రదం చేయండి

సిపిఎం నాయకులు సురేష్, వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

లౌకికవాదం ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను ఐక్యం చేసేందుకు సిపిఎం ఈ నెల 30న సీతంపేటలో ప్రారంభించనున్న మన్యం ప్రాంత ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, జిల్లా నాయకులు పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. మండలంలోని తులసిపాక సచివాలయం పరిధి లక్కవరం గ్రామంలో జరిగిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిపిఎం బస్సు యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి ఉన్న ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తుందన్నారు. మతోన్మాద ఏజెండాతో ప్రజల మధ్య విద్వేశాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. రాష్ట్ర విభజన హామీలను తుంగలో తొక్కి, రాష్ట్ర ప్రజలను బిజెపి మోసగించిందని విమర్శించారు. బీజేపీకి వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు కొమ్ముకాస్తూ రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని పేర్కొన్నారు. బస్సు యాత్ర నవంబర్ 5న చింతూరు చేరుకుంటుందని, ఆ రోజు నిర్వహించే బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మడకం చిన్నయ్య, కలుముల మల్లేష్, సత్తిబాబు, లలిత, సోమిరెడ్డి, కన్నపు రెడ్డి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం విఆర్.పురం మండల నాయకులు

సిపిఎం బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

విఆర్.పురం : ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ నవంబర్ 4, 5 తేదీల్లో ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లాలో ఏజెన్సీ ప్రాంత బస్సు యాత్ర జరుగుతుందని, ఈ యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వం వహిస్తారని తెలిపారు. 5వ తేదీన రేఖపల్లి వద్ద బహిరంగ సభ జరుగుతుందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, ట్రూ అప్ ఛార్జీలు, పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని, రూ.400కే గ్యాస్, రూ.60కే లీటర్ పెట్రోలు, డీజిల్, ఉచితంగా ఇసుక ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, అమరావతిలోనే రాజధాని నిర్మాణం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు సోడి మల్లయ్య, సిరపు తాతబాబు, హజరత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దేముడుకు ఘన నివాళి

గొడ్డేటి దేముడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు

ప్రజాశక్తి-కొయ్యూరు

చింతపల్లి మాజీ శాసనసభ్యులు, సిపిఐ నేత గొడ్డేటి దేముడు 8వ వర్ధంతి సందర్భంగా మండలంలోని వెలగలపాలెంలో గురువారం ఆయన కాంస్య విగ్రహానికి, చిత్ర పటానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ, దేముడు కుమార్తె గొడ్డేటి మాధవి, పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన జాతికి గొడ్డేటి దేముడు విశేష సేవలు అందించారని, ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారానూకరాజు, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలమ్మ, అప్పన్న వెంకటరమణ, వైసిపి నాయకులు జల్లి బాబులు, గాడి నాగమణి, బండి సుధాకర్, సూరిబాబు, సర్పంచులు నాయుడు, జంపా రాజకుమారి, దొడ్ల రమేష్, రాజు, చందు, నూకాలమ్మ, చిన్నారావు, ఎంపీటీసీలు సిహెచ్.మల్లేశ్వరి, నూకరత్నం, నాయకులు నీలాపు సూరిబాబు, రీమాలి గంగాధర్, సిహెచ్ సావిత్రి, గాడి సత్యనారాయణ, గజ్జయ్య దొర, అచ్యుత్, శేఖర్, రామరాజు, గాడి అచ్చిరాజు, అల్లాడ నగేష్ పాల్గొన్నారు.

2000 గడియారాలు పంపిణీ

మాజీ ఎమ్మెల్యే జి.దేముడు 8 వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో అభిమానులు రాగా, సుమారు 2000 మందికి గడియారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దేముడు కుమార్తె, అరకు ఎంపీ మాధవి, ఆమె భర్త, నేను సైతం ఫౌండేషన్ అధినేత శివప్రసాద్ పర్యవేక్షించారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

3 వేల టన్నుల కాఫీ పండ్ల సేకరణ లక్ష్యం

ఐటిడిఏ పిఒ అభిషేక్

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ రైతులకు గిట్టుబాటు ధర అందించడమే లక్ష్యమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఐటీడీఏ ద్వారా కిలో కాఫీ పళ్లకు రూ.43లు ధర కాఫీ రైతులకు చెల్లిస్తామని పేర్కొన్నారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో గురువారం 11 మండలాల హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఎఈఓలు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, కాఫీ లైజన్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల నుండి క్షేత్రస్థాయిలో పండ్లు సేకరించి మాక్స్ సొసైటీకి తరలించే నేపధ్యంలో తూకంలో తేడాలు ఉన్నా శాతానికి మించి వ్యత్యాసం ఉంటే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాఫీ పళ్లను లోడ్ చేసేటప్పుడు అన్‌లోడ్ చేసేటప్పుడు విధిగా సిబ్బంది సంతకాలు చేయాలని సూచించారు. ఈ ఏడాది మూడు వేల టన్నుల కాఫీ పళ్ల సేకరించడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డు ఉప సంచాలకులు ఎస్.రమేష్, 11 మండలాల హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఎఈఓలు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, కాఫీ లైజన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జల జీవన్ మిషన్ కింద చేపట్టిన వివిధ తాగునీటి పథకాల పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి నిర్వహించిన హైబ్రిడ్ సమావేశంలో ప్రభుత్వ ఉత్తర్వులు 56, 8181, 918 కింద మంజూరైన వివిధ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఐదు లక్షల రూపాయల లోపు, ఐదు లక్షల రూపాయలు పైబడి పనులు మంజూరయ్యాయని వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కొన్నిచోట్ల సోర్స్ లేకుండా పైప్ లైన్ వేయడం, పైపులు కొనుగోలు చేయడం జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. సోర్స్ ఉండి పైపులైన్ వేస్తేనే మొదటి దశగా అడ్వాన్స్ చెల్లించాలని, పని పూర్తయితే పూర్తి బిల్లు చెల్లించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు ప్రారంభం కాని వాటికి వెంటనే టెండర్లు పిలవాలని, వాటిని సకాలంలో కాంట్రాక్టర్లు నిర్దేశించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఒక కాంట్రాక్టర్లు ఐదు పనులు మాత్రమే అప్పగించడం జరుగుతుందని, 10 పనుల వరకు అప్పగించవచ్చని కలెక్టర్ నిర్ణయించారు. ప్రభుత్వ ఉత్తర్వులు 56లో 3325 పనులు మంజూరు కాగా 325 పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ ఉత్తర్వులు 8181 కింద 2,260 పనులు మంజూరు కాగా సుమారు 575 పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సంబంధించి త్వరగా పనులు ప్రారంభించాలని, అవసరమైన చోట్ల తిరిగి టెండర్లు పిలవాలని ఆదేశించారు. టెండర్ సమయం పూర్తయినా పనులు పూర్తికాని కాంట్రాక్టర్లను హెచ్చరించాలని ఆదేశించారు. నాణ్యత లోపాలు లేకుండా పనులు సక్రమంగా జరగాలని, క్వాలిటీ చెక్ త్వరగా జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు 918 కింద సుమారు 1300 పనులు మంజూరైనందున నామినేషన్ పద్దతిలో చేపట్టిన పనులు మినహాయించి మిగిలిన వాటికి టెండర్లు పిలవాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జలజీవన్ మిషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ లీలాకృష్ణ, సహాయ ఇంజనీర్లు, చింతూరు ఐటిడిఏ పిఒ చైతన్య పాల్గొన్నారు.

సహజ వనరుల పరిరక్షణతో జీవనోపాధి

పాడేరు: జీవరాశులను సంరక్షించుకుంటేనే సుస్థిర సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జీవ వైవిధ్య భరిత వ్యవసాయ విధానాలు, సుస్థిర భూ వనరుల యాజమాన్యంపై నిర్వహించిన వర్క్ షాప్ ను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ పరిరక్షణ, జీవ వైవిధ్యం, ప్రకృతి వ్యవసాయం, సహజ వనరుల పరిరక్షణతో గిరిజనులకు జీవనోపాధి భద్రత కలుగుతుందని పేర్కొన్నారు. అవసరమైన నేల, నీటి సంరక్షణ పనులు, వాటర్ షెడ్ పనులకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ లేబర్ కాంపోనెంట్ నిధులను ఉపయోగించాలని సూచించారు. పశువుల మేత, పశు సంవర్ధక శాఖలో ఉన్న పథకాలను ఉపయోగించుకొని లబ్దిదారులు లబ్ది పొందాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా పార్క్ పాండ్‌ను గుర్తించాలని, రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైన్‌ఫారెస్ట్ అలయన్స్ కన్సల్టెంట్లు కె. సుదీర్, ఎన్. హేమలత, వాసన్ అసోసియేట్ డైరెక్టర్ ఎం.ఎల్. సన్యాసిరావు, ఫౌండేషన్ ఎకాలజికల్ సెక్యూరిటీస్ ప్రతినిధి ఆర్. కొసలేందరరావు, సీనియర్ మేనేజర్ పి. నాగేంద్రప్రసాద్, వ్యవసాయ, ఉద్యానశాఖల జిల్లా అధికారులు బివిఎస్. నంద, ఎ.రమేష్ కుమార్, స్పైసెస్ బోర్డు క్షేత్రాధికారి బి.కళ్యాణి, డిఆర్డిఎ పిడి వి.మురళి, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, డిఎఫ్ఓ కె.వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిరుప్రాయంలోనే ఆర్యన్‌కు 'నోబెల్'

అవార్డు గ్రహీతకు పలువురి అభినందన

ఆర్యన్‌ను అభినందిస్తున్న కార్పొరేటర్ డేమురు

ప్రజాశక్తి- పెందుర్తి : 14నెలల చిరుప్రాయంలోనే అద్భుతమైన జ్ఞాపకశక్తి, మేథస్సుతో అందరిని అబ్బురపరిచి, నోబెల్ వరల్డ్ రికార్డు, ఇండియా వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న బుడతడిపై ప్రశంసలు, అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గ్రేటర్ విశాఖ, 95వ వార్డు పాపయ్యరాజుపాలెం వివేకానంద విహార్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న గాబు కల్యాణ్‌కుమార్, రాగ ప్రియాంకల కుమారుడు గాబు చార్విక్ ఆర్యన్.అతి చిన్న వయస్సు (14 నెలలు)లోనే ఆన్‌లైన్ రికార్డ్ ద్వారా నోబెల్ వరల్డ్ రికార్డ్, ఇండియా వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నాడు. వివిధ రకాల కేటగిరీలలో జంతువులు, పక్షులు, వాహనాలు, పండ్లు, పువ్వులు, కూరగాయలు, రంగులు, వర్ణమాలలు, సంఖ్యలు, గృహోపకరణాలు, బొమ్మలు, 350 ఫ్లాష్ కార్డ్‌లను, కొన్ని జంతువుల శబ్దాలు, , స్వాతంత్య్ర సమరయోధుల పేర్లను అలవోకగా చెప్పేస్తున్న ఆర్యన్ ప్రతిభను వీడియో రికార్డింగ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా నోబెల్, ఇండియా వరల్డ్ రికార్డుల పరిశీలకులకు పంపారు. ఆన్‌లైన్‌లోని ఆర్యన్ ప్రతిభను పరిశీలించిన మీదట ఈ నెల 13న చార్విక్ ఆర్యన్‌కు నోబెల్ వరల్డ్ రికార్డ్, ఇండియా వరల్డ్ రికార్డ్స్‌ను ప్రకటించారు.

నోబెల్, ఇండియా వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న చార్విక్ ఆర్యన్‌ను స్థానిక వార్డు కార్పొరేటర్ ముమ్మన దేమడు దుశ్శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఆర్యన్‌లోని ప్రతిభను గుర్తించి, అతనికి తర్ఫీదునిచ్చిన తల్లిదండ్రులను కూడా అభినందించారు.

నైపుణ్యాలున్న వారికే ఉద్యోగావకాశాలు

గీతం హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్‌లో పరిశ్రమల నిపుణులు

సదస్సు ప్రారంభిస్తున్న గీతం విసి దయానంద

ప్రజాశక్తి- మధురవాడ : కోవిడ్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక రంగం, ఉక్రెయిన్, రష్యా యుద్ధం తదితర పరిణామాల నేపథ్యంలో వివిధ కంపెనీల నియామకపు ప్రక్రియలో గణనీయమైన మార్పులు వచ్చాయని, ముఖ్యంగా నైపుణ్యాలున్న వారికి మాత్రమే ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని వివిధ పరిశ్రమల నిపుణులు అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించిన గీతం విసిప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ, పరిశ్రమలకు విద్యాలయాలతో మెరుగైన సంబంధాల ద్వారా కాలానుగుణంగా సిలబస్‌లలో మార్పులు చేయవచ్చునన్నారు. శాప్ ల్యాబ్స్ డైరక్టర్ కమల్ స్టీఫెన్ మాట్లాడుతూ విద్యార్థులు పరిస్థితులకు తగిన విధంగా తమను మలచుకోవవాలని, నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్ విజయశేఖర్, ఐబిఎమ్ లోకల్ హెడ్ ఎ.అనురాధ, కాగ్నిజెంట్ సీనియర్ డైరక్టర్ సి.సుబ్రహ్మణ్యం, ఇన్‌టెల్ బిజినెస్ మేనేజర్ హెచ్.గిరీష్, బ్రాండిక్స్ టేలంట్ మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ షెహజాది, అమర్‌రాజా గ్రూప్ బిజినెస్ హెచ్‌ఆర్ రవికుమార్, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ మేనేజర్ జాక్సన్ జాన్సన్, ఆల్‌స్టామ్ డైరక్టర్ ఎ.శ్రీనివాస్, గీతం జిసిజిసి డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రొఫెసర్ సి.శాంతి, ప్రొఫెసర్ బి.రవికిషోర్ సంధానకర్తలుగా వ్యవహరించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, తాము చదివే కోర్సు పట్ల లోతైన అవగాహన, బృందాలుగా పనిచేసే సామర్థ్యం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకునే తత్వం అవసరమని పరిశ్రమల నిపుణులు సూచించారు.

పలుచోట్ల ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

బుక్‌లెట్ చూపుతున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని ఖండ్రుము పంచాయితీలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని స్థానిక మండల ఎంపీపీ, జడ్పిటిసిలు బి.ఈశ్వరి, సిహెచ్ జానకమ్మ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిం చిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, హరి, వైద్య అధికారులు ఎన్.విజయ్ కుమార్, ప్రేమ, పి.రాంబాబు, వైసిపి మండల నాయకులు డి సింహాచలం పాల్గొన్నారు.

చింతపల్లి: గిరిజనుల ఆరోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష చేపట్టారని ఎంపీపీ కోరార అనూష దేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యలు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షను మండలంలోని చౌడుపల్లి పంచాయతీ సచివాలయం 1లో ఎంపీడీవో ఆశాజ్యోతి, స్థానిక సర్పంచ్ గెమ్మేల లలిత, ఎంపీటీసీ లువ్వాబు మీనా కుమారి ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ, జడ్పిటిసిలు ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, వార్డు సభ్యుడు కోరాబు కరుణానిధి, వైకాపా నాయకులు సింహాచలం, మచ్చులింగం పాల్గొన్నారు.

చింతపల్లిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి

పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు : మండలంలోని రావణాపల్లిలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అక్కడికొచ్చిన రోగులతో మాట్లాడుతూ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా గ్రామీణ స్థాయిలో వైద్య సేవలు అందించాలనే ఆలోచన ఇదివరకు ఏ ప్రభుత్వాలు చేయలేకపోయాయని తెలిపారు. ఈ వైద్య శిబిరంతో ఈ కార్యక్రమం ముగిసిపోవడంలేదని ఆపరేషనకు అవసరమైన, మెరుగైన వైద్యం ఇక్కడి నుంచి రెఫరెన్స్‌తో ఆరోగ్యశ్రీ హాస్పటల్లో ఉచితంగా వైద్య సేవలు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రావణాపల్లి సర్పంచ్ లక్ష్మి, ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలమ్మ, అప్పన్న వెంకటరమణ, వైసిపి నాయకులు జల్లి బాబులు, గాడి నాగమణి, బండి సుధాకర్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులను పలకరిస్తున్న పిఒ చైతన్య

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఐటిడిఏ పిఒ

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు ఐటిడిఏ పిఒ చైతన్య స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని గురువారం సందర్శించారు. ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం, ఎన్ఆర్‌సి కేంద్రం, మినీ ఎస్ఎన్‌సిఓ విభాగాలను పరిశీలించారు. వాట్లో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు హాస్పిటల్‌లో అడ్మిట్ అయిన రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యం సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు ఇంకా మెరుగుపర్చాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం అండ్ హెచ్‌వో పుల్లయ్య, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్లు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - మారేడుమిల్లి : ఎదురెదురుగా రెండు కారులు ఢీకొన్న సంఘటన మారేడుమిల్లి - రంపచోడవరం ప్రధాన రహదారి మూడవ కిలోమీటర్ టేకు ప్లాంటేషన్ ప్రమాదకర మలుపు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. రాజమండ్రి నుండి కూనవరం వెళ్తున్న జియో సిబ్బంది బెల్లినో కారును కాకినాడకు చెందిన మరో కారు ఎదురుగా ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కాకినాడకు చెందిన అంకిత్ కాలిపై తీవ్ర గాయమైంది. రాజమండ్రి వాసులు సుధీర్, సాయిరాంలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్సులో స్థానిక పిహెచ్సికి క్షతగాత్రులను తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పలు రైళ్లు రద్దు, గమ్యస్థానాల మార్పు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా 07466 రాజమండ్రి - విశాఖపట్నం ప్యాసింజర్, 07467 విశాఖపట్నం - రాజమండ్రి ప్యాసింజర్ ప్రత్యేక రైళ్లను అక్టోబర్ 27 నుంచి 29 వరకు, 22701 విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను అక్టోబర్ 27, 28 తేదీల్లో రద్దు చేశారు. అదేవిధంగా 18514 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 26 నుంచి 28 వరకు కోరాపుట్‌లో షార్ట్ టర్మినేట్ చేయబడింది. దీంతో ఆ రైలు అక్టోబర్ 27 నుంచి 29 వరకు 18513 కిరండూల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్‌గా కోరాపుట్ నుంచి విశాఖపట్నానికి తిరిగి వస్తుంది. 18005 హౌరా - జగదల్‌పూర్ సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 26 నుంచి 28 వరకు టిట్లాగఢ్ వద్ద షార్ట్ టర్మినేట్ చేయబడింది. ఈ నేపథ్యంలో 18006 జగదల్‌పూర్ - హౌరా సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ 27 నుంచి 29 వరకు టిట్లాగఢ్ నుంచి హౌరాకు వెళ్తుంది. 18447 భువనేశ్వర్ - జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 26 నుంచి 28 వరకు కోరాపుట్ వద్ద షార్ట్ టర్మినేట్ చేయబడింది. దీంతో 18448 జగదల్‌పూర్ - భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి భువనేశ్వర్‌కు తిరిగి వస్తుంది.

జివిఎంసి క్రికెట్ జట్టు ఘన విజయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పూల్ - సి మ్యాచ్‌లో మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ క్రికెట్ జట్టు ఘన విజయం సాధించింది. విడిసిఎ-బి మైదానంలో జివిఎంసి, ఎంఒవి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జివిఎంసి జట్టు 5 వికెట్లు తేడాతో గెలిచింది. మొదటగా బ్యాటింగ్ చేసిన ఎంఒవి జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 138 పరుగులు చేసింది. బదులుగా జివిఎంసి జట్టు 15.2 ఓవర్లలో 140 పరుగులు సాధించి లక్ష్యాన్ని అందుకుంది.

గ్రీన్ అంబాసిడర్లకు అందని వేతనాలు

పంచాయతీలకు ఆదాయం సమకూరుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పల్లెలను పరిశుభ్రంగా ఉంచి, చెత్త నుంచి ఎరువు తయారుచేసి పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్న గ్రీన్ అంబాసిడర్లు జీతాలు అందక బాధపడుతున్నారు. వీరిపట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది. గ్రామాల్లో తడి, పొడి చెత్తతో పాటు గాజు పెంకులు, ప్లాస్టిక్‌ను వేరుచేసి వాటిని వేర్వేరు తొట్టెల్లో వేసి కుళ్లించి, వానపాములతో సేంద్రీయ ఎరువు తయారుచేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు గ్రీన్ అంబాసిడర్లు ఆదాయం సమకూరుస్తున్నారు. జిల్లాలో ఈ తరహా పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు 1669 మంది వుండగా, షెడ్డు కాపలాదారులు 485 మంది వున్నారు. వీరికి ఒక్కొక్కరికీ ఆరు వేల రూపాయల వేతనాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేతనం గతంలో కేంద్ర ప్రభుత్వం చెల్లించేది. రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్చడంతో కేంద్ర ప్రభుత్వం వీరికి చెల్లించాల్సిన వేతనాలు నిలిపివేసింది. అప్పటి నుంచి గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు సమస్యలు మొదలయ్యాయి. ప్రతి నెలా జీతాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలు వుండడంతో ఏ నెలా ఆరు వేల వేతనం చెల్లించడంలేదు. ఏడాది నుంచి కొన్ని పంచాయతీలు ఆరు వేల రూపాయల వేతనానికిగానూ మూడు వేల రూపాయలే చెల్లిస్తున్నాయి. కొన్ని పంచాయతీలు నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదు. పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు, ఇతర వాటికి మళ్లించడంతో పంచాయతీలు వేతనాలను వీరికి చెల్లించలేకపోతున్నాయి. గతంలో మూడు నెలలకు ఒకసారైనా వేతనాలు అందేవి. ఇప్పుడు నెలలు గడుస్తున్నా పూర్తి వేతనాలు ఇవ్వడంలేదు. పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలకు లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం ఖర్చు పెట్టింది. చెత్తతో తయారుచేసిన సేంద్రియ ఎరువుల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని ప్రభుత్వాలు గొప్పగా చెప్పాయి. కానీ ఆచరణలో ఆ సంపద సృష్టించే అంబాసిడర్లు జీతాలకు నోచుకోక అవస్థలు పడుతున్నారు.

పరిసరాలను శుభ్రపరుస్తున్న గ్రీన్ అంబాసిడర్

ఉప రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచనలు చేశారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా పర్యటించనున్నట్టు వెల్లడించారు. ఈ పర్యటన నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీసు, ఇండియన్ నేవీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆంధ్ర వైద్య కళాశాల ఏర్పడి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించే శత వసంతాల వేడుకకు ఉప రాష్ట్రపతి హాజరవుతున్నారని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమ నిర్వహణకు అన్ని విభాగాల అధికారులు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. 28వ తేదీ ఉదయం విశాఖపట్నం చేరుకున్నప్పటి నుంచి కార్యక్రమం ముగిసి ఆయన తిరుగు పయనమయ్యే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది మెడికల్ ఎక్విప్‌మెంట్ సిద్ధంగా ఉంచుకోవాలని డిఎం అండ్ హెచ్ఒను ఆదేశించారు. ఎయు కన్వెషన్ సెంటర్, ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాల్లో కార్యక్రమాలు జరిగే క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రత్యేక జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఇపిడిసిఎల్ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నేవీ అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. జివిఎంసి పరిధిలో సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పోర్టు రోడ్డులో దుమ్మూ ధూళి లేకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ దీపాలు అమర్చాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. గార్డు ఆఫ్ ఆనర్ ఇతర సంప్రదాయక కార్యక్రమాల నిర్వహణలో నేవీ, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమీక్షా సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఇండియన్ నేవీ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, డిఆర్ఒ కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

కలెక్టర్ మల్లికార్జున పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్‌తో కలిసి గురువారం సాయంత్రం ఎఎస్ఎల్ నిర్వహించారు. అందులో భాగంగా ముందుగా ఐఎన్ఎస్ డేగాలో ఉప రాష్ట్రపతికి రిసెప్షన్, పర్యటన ఏర్పాట్లు విషయమై నేవీ అధికారులతో చర్చించారు. తదుపరి ఎఎంసికి చేరుకొని అక్కడ పైలాన్, ప్లాంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్, ఫొటో సెషన్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిబాబుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. తదుపరి ఎయు కన్వెన్షన్ సెంటరులో ఎఎంసి శతాబ్ది వేడుకల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

కింగ్ జార్జ్ ఆసుపత్రి ఆవరణలోగల ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాలను జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. కళాశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట నాలుగో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఎఎంఒహెచ్ డాక్టర్ రాజేష్, డిఇఇ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

పరిసరాలను శుభ్రపరుస్తున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన 'స్వచ్ఛ భారత్'

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. స్థానిక శివాలయం లోపల, బయట చెత్తాచెదారాలను తొలగించారు. ఎండిపోయిన చెత్తాచెదారాలు వ్యర్థ పదార్థాలకు నిప్పు పెట్టారు. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ డిఎస్పి సురేష్ మాట్లాడుతూ కార్తీకమాసం సమీపిస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి వస్తూ పోతుంటారని, ఈ క్రమంలోనే శివాలయంలో శుభ్ర పరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సుందరం, సిఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సూపరింటెండెంట్ డాక్టర్ టీవీ శేషారెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ కె.మహేష్ బాబు గురువారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ తొలి రోజు ఆరుగురికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. తమ ఆసుపత్రిలో రెండు రోజులకు ఒక సారి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరుగుతాయని, ఈ అవకాశాన్ని కూటూరు, రేఖపల్లి, జీడిగుప్ప, గౌరిదేవిపేట, నెల్లిపాక, కూనవరం పిహెచ్‌సిల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ బి.బొజ్జి, స్టాఫ్ నర్స్ కె.పలీన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిపై కుట్రలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చంద్రబాబును అక్రమ కేసులో అరెస్టు చేసి, తెలుగుదేశం పార్టీని లేకుండా చేయాలని వైసిపి నాయకులు చూస్తున్నారని టిడిపి విజయనగరం జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టారన్నారు. ఆయన అరెస్టుపై రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ సహా ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు, భువనేశ్వరి, బ్రాహ్మణి, లోకేష్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బాబుకు అన్యాయం జరిగితే భువనేశ్వరి రాకూడదా ? అని ప్రశ్నించారు. జగన్ జైలుకు వెళ్లినప్పుడు విజయమ్మ, షర్మిల, భారతి రోడ్డు మీదకు రాలేదా ? అని అడిగారు. అవినీతిపై బొత్స మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వోక్స్ వ్యాగన్ రాష్ట్రం నుంచి బొత్స కారణంగానే వెళ్లిపోయిందన్నారు. విజయనగరంలో మద్యం ఏరులై పారుతోందని, అంతా బొత్స చలవ కాదా అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో బొత్స చేసిన భారీ కుంభకోణం అందరికీ తెలిసిందేనని విమర్శించారు. ప్రజల మధ్యలోకి వెళ్లలేక వైసిపి నేతలు బస్సు యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు నవంబర్ 8కి వెయ్యి రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఆ రోజున రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్టు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు తెలిపారు. గురువారం అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ముందుకు రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.